# పేదలంటే అంత చులకనా!

- వారు ఏం తప్పు చేశారని ఇండ్లను కూల్చుతున్నారు..
- కనీసం ముందస్తు నోటీసులు కూడా ఇవ్వరా?
- కూల్చివేత గంట...కట్టడం పేదోడి జీవితకాలం
- హైడ్రా వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గం
- రేవంత్‌రెడ్డి ఇదేనా మీ పాలన?
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



మోర్తాడ్, మే 22: హైడ్రా కూల్చివేతలపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అక్రమ నిర్మాణాలను హైడ్రా పేరుతో కూల్చివేయడం న్యాయమే అనుకుంటే ముందుస్తు నోటీసులు, కనీస సమయం ఇవ్వకుండా పేదలవి మాత్రమే ఎందుకు కూల్చుతున్నారని, వారు చేసిన తప్పేంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చాలా ఏండ్ల నుంచి పేదలు అక్కడ నివసిస్తున్నారని, వారికి ప్రత్యామ్నాయం చూపకుండా పేదలపై కనికరం లేకుండా అరాచకంగా ఎందుకు ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పేదోడు అంటే అంత చులకనా అని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి అన్న తిరుపతిరెడ్డి లాంటి పెద్దలకు మాత్రం సమయం ఇస్తూ వాళ్ల అక్రమ కట్టడాలను ఎందుకు కూల్చడం లేదని నిలదీశారు. కాంగ్రెస్ నాయకులు రియల్ ఎస్టేట్ వ్యాపారులను కమీషన్లు ఇవ్వండి లేదంటే మీ ఇంటిపైకి హైడ్రాను పంపిస్తామని బెదిరిస్తున్నారంటే రాష్ట్రంలో పరిస్థితి ఏంటో ప్రజలు చూస్తున్నారని పేర్కొన్నారు. చట్టం ఎవరికీ చుట్టం కాదని, మాది ప్రజాపాలన అంటూ మైకుల ముందు ఊదరగొట్టే రేవంత్‌రెడ్డి హైడ్రా విషయంలో కూడా చట్టం అందరికీ సమానంగా వర్తింపజేయాలని తెలియదా? అని ప్రశ్నించారు. హైడ్రా విషయంలో కోర్టు ఎన్ని మొట్టికాయలు వేసినా తీరు మారకపోవడం, గతంలో అనేక సార్లు కోర్టు తీర్పులను తప్పుబడుతూ రేవంత్‌రెడ్డి బహిరంగంగా మాట్లాడిన తీరు ఆయనకు చట్టాలపై ఎటువంటి గౌరవం లేదన్న విషయం స్పష్టమవుతున్నదని పేర్కొన్నారు. అధికార బలాన్ని ఉపయోగించి పేదవాడి ఇల్లు కూల్చడం రేవంత్‌రెడ్డికి గంట పని కావచ్చు, కానీ ఇల్లు కట్టుకోవడం అన్నది పేదోడి జీవితకాల కష్టం, వారి గోల్ అన్న విషయాన్ని గుర్తెరగాలని హితవు పలికారు. రాచరిక పోకడలతో నేనే రాజు నేనే మంత్రి అన్నట్లు పేద ప్రజలతో చెలగాటమాడుతున్న రేవంత్‌పై ప్రజలు తిరగబడే రోజు తొందరలోనే వస్తుందన్నారు. పేదోడి ఇల్లు కూలగొట్టి .. దాన్ని బూచీగా చూపి పెద్దవాడిని భయపెట్టి, కమీషన్లు రా బట్టి.. ఢిల్లీకి మూటలు పంపు అన్న చందంగా రేవంత్ పాలన ఉన్నదని మండిపడ్డారు.

## రేవంత్ రాజకీయకోటలు కూలగొట్టడం ఖాయం

కేసీఆర్‌ను కాకుండా రేవంత్‌రెడ్డిని ఎందుకు ఎన్నుకున్నామని ప్రతి ఒక్కరూ బాధపడుతున్నారని, ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఇలాగే వ్యవహరిస్తే నీ రాజకీయ కోటలు ఇదే ప్రజలు కూలగొట్టడం ఖాయమని హెచ్చరించారు. కాళేశ్వరం పై సుప్రీంకోర్టు వ్యాఖ్యతో కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీస్‌లు ఇవ్వడం కేవలం ఆయనను వేధించడానికే అనే విషయం స్పష్టమైందన్నారు. కేసీఆర్‌ను ఎదుర్కోలేకే కాంగ్రెస్, బీజేపీ ఒక్కటయ్యాయని అందుకే రేవంత్‌రెడ్డి కక్షపూరిత రాజకీయాలకు కేంద్రం వంతపాడుతున్నదని ఆరోపించారు. కాళేశ్వరం తెలంగాణ కరువును పారద్రోలే ఒక్క బృహత్తర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అని సీడబ్ల్యూసీ బృందం, దాని చీఫ్ ఇంజినీర్ సీకేఎల్ దాస్, అప్పటి గవర్నర్ నరసింహన్, మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్, సాగునీటి రంగనిపుణులు కాళేశ్వరం గొప్పతనం గురించి చెప్పిన మాటలు రేవంత్, బీజేపీకి విన బడకపోవడం శోచనీయమన్నారు.

## నారు మడిలో కేసీఆర్, కేటీఆర్ పేర్లు



పొతంగల్, మే 22 : ఓ రైతు తన వ్యవసాయ పంట పొలాల్లో కేసీఆర్, కేటీఆర్ పేర్లతో నాట్లు వేసి అభిమానాన్ని చాటుకున్నాడు. పొతంగల్ మండలం జల్లాపల్లి గ్రామానికి చెందిన ఖదీర్ బేగ్ అనే రైతు తన వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, బీఆర్ఎస్ పేర్లు నారు మడిలో అలికించాడు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షానికి మొలకెత్తి పేర్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పల్లెల్లో మళ్లీ సంక్షేమ పథకాలు అందాలంటే కేసీఆర్ సారే రావాలని, రైతు రాజు కావాలంటే తెలంగాణకు మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని ఈ సందర్భంగా ఖదీర్ బేగ్ పేర్కొన్నాడు. కేసీఆర్ పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయని గుర్తు చేశాడు.

# బోనస్ ఏది..?

- సన్న వడ్లకు అందని బోనస్ డబ్బులు
- సర్కారు తీరుపై రైతుల ఆగ్రహం
- కాంటా పెట్టి రోజులు గడుస్తున్నా స్పందన కరువు
- ఉమ్మడి జిల్లాలో రూ.449 కోట్ల బకాయిలు
- ఇచ్చిన మాట నెరవేర్చడంలో ప్రభుత్వం తాత్సారం





సర్కారును నమ్ముకొని యాసంగి సీజన్‌లో సన్న వడ్లు పండించిన రైతులకు బోనస్ కష్టాలు తప్పడం లేదు. క్వింటాలుకు రూ.ఐదు వందలు బోనస్ ఇస్తామన్న ప్రభుత్వం ఆ విషయాన్ని మరిచిపోయినట్లున్నది. వడ్లు కాంటా పెట్టి రోజులు గడుస్తున్నా.. బోనస్ డబ్బులు మాత్రం ప్రభుత్వం ఇంకా విడుదల చేయలేదు. మరోవైపు వానకాలం సీజన్ ప్రారంభం అవుతుండడంతో ప్రభుత్వం ఇస్తామన్న ప్రోత్సాహక డబ్బుల కోసం రైతులు వేయి కండ్లతో ఎదురుచూస్తున్నారు.

– నిజామాబాద్, మే 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

యాసంగి సీజన్‌లో సన్న వడ్లు పండించిన రైతులకు బోనస్ చెల్లించడంలో సర్కారు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నది. ఇచ్చిన మాటను అమలు చేసేందుకు కొర్రీలు పెడుతూ.. రైతులను ముప్పు తిప్పలకు గురిచేస్తున్నది. నిర్ణీత గడువులోగా బోనస్ డబ్బులు చెల్లించాల్సి ఉండగా.. రోజులు గడుస్తున్నా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కావడం లేదు. కనీస మద్దతు ధరకు ధాన్యం అమ్ముకున్న రైతులకు చెల్లింపులు కూడా ఆలస్యం అవుతున్నాయి. ఇదేందని ప్రశ్నిస్తే సమాధానం ఇచ్చే వారు లేకుండా పోయారు. సన్న వడ్లు పండిస్తే క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటి వరకు అరకొరగానే చెల్లింపులు చేసింది. కొద్ది మందికి మాత్రమే బోనస్ డబ్బులు జమ కాగా మిగిలిన వారికి రావడం లేదు. ధాన్యం విక్రయించిన రెండు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో బోనస్ జమ చేస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రకటించారు. నిజామాబాద్‌లో నిర్వహించిన రైతు మహోత్సవంలోనూ ఇదే విషయాన్ని నొక్కి చెప్పారు. బోనస్ డబ్బులు ఆపడం లేదంటూ కుండబద్ధలు కొట్టారు. కానీ బోనస్ చెల్లింపుల్లో మాత్రం ఎడతెగని నిర్లక్ష్యం తాండవిస్తోంది. ఏ కారణంతో ఇలా జరుగుతున్నదో ఎవ్వరికీ అర్థం కావడం లేదు. అసలు ప్రభుత్వం బోనస్ ఇస్తుందా? లేదా? అని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సర్కారు మాటలు నమ్మి సన్నాలు సాగు చేశామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు రూ.449 కోట్ల వరకు బకాయిలు పేరుకు పోయినట్లుగా తెలుస్తోంది.

## ధాన్యం కొనుగోళ్లలో జోరు.. బోనస్ చెల్లింపులో బేజారు..

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లు భారీగా జరిగాయి. కేసీఆర్ హయాంలో ఏర్పాటైన పద్ధతి ప్రకారమే అధికార యంత్రాంగం ధాన్యాన్ని సేకరించింది. గతం మాదిరిగా ఈసారి నిజామాబాద్ జిల్లా రాష్ట్రంలోనే ముందు వరుసలో నిలిచింది. కామారెడ్డి జిల్లా సైతం టాప్–5లో నిలిచినట్లు అధికారులు చెబుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో క్రమపద్ధతిలో కొనుగోళ్ల ప్రక్రియను ఏర్పాటు చేయడంతోనే ఇదంతా సాధ్యమైంది. కల్లబొల్లి హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రైతులను అడుగడుగునా మోసం చేస్తున్నది. ఇందులో బోనస్ చెల్లింపు ప్రధానమైనది. సన్నాలకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తామని ఘనంగా చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి మాటలకు చేతలకు పొంతనే ఉండడం లేదు. నిజామాబాద్ జిల్లాలో యాసంగిలో 7లక్షల 15వేల మెట్రిక్ టన్నులు సన్న రకం ధాన్యాన్ని సేకరించారు. వీటికి మొత్తం రూ.360కోట్లు మేర బోనస్ రైతులకు చెల్లించాల్సి ఉన్నది. కామారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకూ లక్షా 77వేల మెట్రిక్ టన్నుల సన్నాలను యంత్రాంగం కొనుగోలు చేయగా.. బోనస్ రూ.89కోట్లు చెల్లించాల్సి ఉంది. కాగా ప్రభుత్వం ఇందుకోసం నిధులు విడుదల చేయడం లేదు. ఇదేమని ప్రశ్నిస్తే సర్కారు నుంచి సమాధానం రావడం లేదు.

## అమాత్యుల మాటలకు అర్థాలే వేరులే..

రైతు మహోత్సవం పేరిట ఎగ్జిబిషన్‌ను ప్రారంభించేందుకు ఏప్రిల్‌లో జిల్లాకు ముగ్గురు మంత్రులు వచ్చారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు వచ్చి రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. రైతుభరోసాను ఏప్రిల్ నెలాఖరులోగా అన్నదాత ఖాతాల్లో జమ చేస్తామని వ్యవసాయ మంత్రి చెప్పారు. రైతులోకానికి బహిరంగంగానే క్షమాపణలు కోరారు. పెట్టుబడి సాయాన్ని సరైన సమయంలో వేయలేకపోయామంటూ ఒప్పుకున్నారు. సీన్ కట్ చేస్తే వ్యవసాయ మంత్రి మాటలకు నెల రోజులు గడిచినా రైతు భరోసా సగానికి ఎక్కువ మంది రైతులకు జమ కాలేదు. మరో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సైతం ఘనంగా మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చూస్తామంటూ చెప్పుకొచ్చారు. సన్నాలకు రూ.500 చొప్పున చెల్లిస్తామని త్వరగా రైతుల ఖాతాల్లోనే బోనస్ వేస్తామంటూ చెప్పుకొచ్చారు. సీన్ కట్ చేస్తే మంత్రి మాటలన్నీ నీటి మూటలయ్యాయి. ఉమ్మడి జిల్లాలో బోనస్ చెల్లింపులు సరిగా కాకపోవడంతో వందల కోట్ల రూపాయలకు బకాయిలు చేరుకోవడం విడ్డూరంగా మారింది.



# కాంగ్రెస్ చేతిలో తెలంగాణ విధ్వంసం

- బుల్డోజర్ డ్రైవర్ పోస్టుల భర్తీ.. సరికొత్త విధ్వంస పాలనకు నాంది
- యూపీ సర్కారును తలదన్నేలా రేవంత్ పాలన
- ఉన్నవి కూలగొట్టడాలు తప్ప కొత్త కట్టడాలేవీ?
- బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి



ఖలీల్‌వాడి, మే 22 : హైడ్రా డిపార్ట్‌మెంట్‌లో బుల్డోజర్ డ్రైవర్ పోస్టుల భర్తీకి జారీ చేసిన నోటిఫికేషన్.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ సరికొత్త విధ్వంస పాలనకు నాంది అని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. రెండువందల బుల్డోజర్ డ్రైవర్ల పోస్టుల భర్తీకి 10 వేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. అభివృద్ధి కోసం కాకుండా వినాశం కోసం ఉద్యోగ నియామకాలు చేపట్టడం వింతగా ఉన్నదని పేర్కొన్నారు. యూపీలోని యోగి సర్కారును తలదన్నేలా రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి బుల్డోజర్ పాలన సాగుతోందని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. చట్టపాలన ప్రకారం బుల్డోజర్ న్యాయం ఆమోదయోగ్యం కాదని సుప్రీం కోర్టు విస్పష్టమైన తీర్పునిచ్చిన తర్వాత కూడా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బుల్డోజర్లనే నమ్ముకోవడం సిగ్గు చేటని విమర్శించారు. ప్రజాస్వామిక విలువలను రూల్ ఆఫ్ లాను రాజ్యాంగాన్ని పౌర హక్కులను లెక్క చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల హక్కులను హరిస్తున్నదని ఆరోపించారు. తెలంగాణ సంస్కృతిని సమాధి చేస్తూ అందాలను ఆరబోయడం పాపులర్ సంస్కృతిగా చిత్రీకరిస్తూ తెలంగాణ ఆత్మగౌరవ భాషను, యాసను గోస పెడుతూ ఢిల్లీ కాంగ్రెస్ పెద్దల దోపిడీ భాషను పరిచయం చేసిన రేవంత్‌రెడ్డి చివరకు సాధారణ ప్రజల జీవితాల్లోకి బుల్డోజర్ న్యాయాన్ని తేవడం ఆందోళన కలిగించే విషయమని పేర్కొన్నారు.

### సంక్షోభంలో వ్యవసాయం..

రైతుబంధు ఇవ్వకుండా రుణమాఫీ చేయకుండా సర్కార్ చేసిన గాయంతో వ్యవసాయం సంక్షోభంలో పడిందని పేర్కొన్నారు. పంటలు కొనే దిక్కు లేదన్నారు. రియల్ ఎస్టేట్ డమాల్ అయ్యిందని, రియల్టర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ అరాచక పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఆక్రందనల పాలయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో తెలంగాణ సుభిక్షంగా వర్ధిల్లితే, రేవంత్ పాలనలో రాష్టమంతా దుర్భిక్షంగా మారిందని ధ్వజమెత్తారు. రాహుల్‌గాంధీ ఇకనైనా రేవంత్ మోసపు పాలనపై నోరు విప్పాలని, ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు ప్రజలకు సారీ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

### ప్రశ్నించినవారిపై అక్రమ కేసులు

అప్రజాస్వామిక విధానాలను ప్రశ్నిస్తే వారిని బుల్డోజర్ పాలన పేరుతో అక్రమ కేసుల్లో ఇరికించి జైలు పాలు చేయడం సర్వ సాధారణంగా మారిందన్నారు. వారు పేదలా, మేధావులా, చరిత్రకారులా, జర్నలిస్టులా, వైద్యులా అన్నది కాంగ్రెస్‌కు పట్టదని, కాంగ్రెస్ పాలనను వ్యతిరేకించే వారిపై అక్రమ కేసులు పెట్టడం, వారి ఇండ్లను బుల్డోజర్లతో కూల్చడం రాష్ట్రంలో నిత్యకృత్యంగా మారిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. మోదీకి ఈడీ, రేవంత్‌కు జేసీబీ, ఏసీబీ జనాలను ఏడిపించే వెపన్స్‌గా మారాయన్నారు. పొద్దున లేస్తే తిట్టడాలు, అక్రమ కేసులు పెట్టి కొట్టడాలు, ఉన్న అద్భుతమైన నిర్మాణాలు కూలగొట్టడాలు తప్ప కొత్త కట్టడాలు లేని రేవంత్ పాలన దేనికి సంకేతమని నిలదీశారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా ల్యాండ్, శాండ్, మైన్, వైన్ మాఫియాల ఆకృత్యాలే దర్శనమిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.



బాన్సువాడ పట్టణంలో జలమయమైన ప్రధాన రహదారి

## జోరువాన

నమస్తే తెలంగాణ యంత్రాంగం, మే 22 : ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధ, గురువారాల్లో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. నిజామాబాద్, కామారెడ్డి జిల్లా కేంద్రాల్లో రోడ్లపై వర్షపు నీరు నిలిచి కాలువలను తలపించాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని గ్రామాల్లో ఇండ్లలోకి వర్షపు నీరు రాగా.. కమ్మర్‌పల్లిలో ఓ ఇల్లు కూలింది. నాగిరెడ్డిపేట మండలంలోని పలు గ్రామాల్లో చిన్నచిన్న కుంటలు, పొలం మడుల్లో నీరు నిలిచింది. పోచారం పాఠశాలలో ప్రహరీ కూలిపోవడంతో వర్షపు నీరు పాఠశాల ఆవరణలో నిలిచిపోయింది.

అంకాపూర్ గ్రామంలో రైతు మార వెంకట్ రెడ్డి పండించిన ఆయిల్‌పాంలో కోతకు వచ్చిన గెలలు



# ఫలించిన కేసీఆర్ కృషి

- నూనె గింజల సాగులో ఇందూరుకు విశిష్టస్థానం
- నాలుగేండ్ల క్రితం బీఆర్ఎస్ సర్కారు ప్రోత్సాహం
- అంకాపూర్ గ్రామంలో ఆయిల్ పాం పంట కోత

ఆర్మూర్ టౌన్, మే 22: నిజామాబాద్ జిల్లా నూనె గింజల సాగులోనూ ప్రత్యేకతను సాధించింది. నూనె గింజలను సాగుచేసే రైతులకు కేసీఆర్ ప్రభుత్వం భారీ ప్రోత్సాహకాలను అందించి, వారికి శిక్షణ సైతం ఇప్పించింది. ఆర్మూర్ మండలం చేపూర్ శివారు నర్సరీలో మొక్కలు సిద్ధం చేసి, ఔత్సాహికులకు అందించింది. జిల్లాలో ఆయిల్ పాం సాగు చేసే రైతులతో బైబ్యాక్ ఒప్పందం కింద ప్రియూనిక్ ఇండియా లిమిటెడ్ కంపెనీతో సర్కారు ఒప్పందాలు చేసింది. దీంతో జిల్లాలో వందల ఎకరాల్లో ఆయిల్ పాం మొక్కలు నాటగా పంట కోత దశకుచేరింది. ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో రైతు మార వెంకట్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో 2022లో నాటిన ఆయిల్ పాం మొక్కలు ఏపుగా పెరిగి గెలలు వచ్చాయి. ఈ నేపథ్యంలో అంకాపూర్ గ్రామంలో మున్నూరు కాపు సంఘంలో ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ, ప్రియూనిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో గురువారం మొదటి గెలల కోత, సేకరణ ప్రారంభోత్సవం కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి పసుపు బోర్డు అధ్యక్షుడు పల్లె గంగారెడ్డి,మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, ఉద్యాన, పట్టు పరిశ్రమ,ప్రి యూనిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# మామిడి చెట్లకు వైరస్

## ఆందోళనలో రైతులు

డిచ్‌పల్లి, మే 22 : నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలంలోని రామడుగు–గోవిందుపల్లి గ్రామాల శివారులోని మామిడి చెట్లకు వైరస్ సోకింది. చెట్లలోని సగభాగం ఎండిపోయింది. దీంతో వేసవిలో రావాల్సిన మామిడి పంట చేతికి అందకుండా పోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట చేతికందే సమయంలో వైరస్ సోకడంతో తమకు తీవ్ర నష్టాన్ని చేకూరుతుందని వాపోయారు. పంటలకు వైరస్ సోకితే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ముందస్తుగా తమకు తెలియజేస్తే బాగుంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఇదే విషయమై ఉద్యానవన శాఖ అధికారులను రైతులు సంప్రదించగా ఇది సహజంగా సోకేదేనని భయపడాల్సిన పని లేదని తెలిపారు. మామిడి చెట్ల కొమ్మలను కత్తిరించి ఫాదర్ కాపర్ యాక్సిఫ్లోరైడ్‌ను లీటర్ నీటిలో మూడు గ్రాముల చొప్పున కలిపి చెట్టంతా తడిసేలా పిచికారీ చేసుకోవాలని ఉద్యానవన అధికారులు సూచించారు.దీంతోపాటు మామిడి పంట నీటి యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు.



వైరస్ సోకడంతో సగ భాగం ఎండిపోయిన చెట్టు